క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


కలెక్టర్ నాగరాణితో జిల్లా వైద్యాధికారి గీతాబాయి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని జిల్లాలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతా బాయి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా కృషి చేయాలని, ఇందుకు అనుగుణంగా తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి మెడికల్ అధికారులు, సిబ్బందిని సమాలోచనలు చేయాలన్నారు.

శోభన్‌బాబు వర్ధంతి


భీమవరంలో శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: తెలుగు ఇండస్ట్రీలో ఎవర్ గ్రీన్ సోగ్గాడు శోభన్‌బాబు అని అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. శోభన్‌బాబు 17వ వర్ధంతి సందర్భంగా గురువారం భీమవరంలో శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొండా రాంబాబు, కారుమూరి భాస్కరరావు, అద్దాల సత్యనారాయణ, కంచర్ల భాస్కరరావు గుప్తా, పెదపాటి రాజబాబు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన


ఎస్సీ బాలికల హాస్టల్‌లో మాట్లాడుతున్న సివిల్ జడ్జి సుధారాణి

ఉండి: గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై తల్లిదండ్రులకు బాలికలకు అవగాహన కల్పించాలని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి అన్నారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గుడ్‌టచ్–బ్యాడ్ టచ్, చిన్నారుల ప్రాథమిక హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని ఉండి ఎస్సీ బాలికల హాస్టల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, పి.అంబేడ్కర్, ఎంబీ భవానీ, పాల లక్ష్మీ, సీఐ జగదీశ్వర్‌రావు, ఎస్సై నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మోగల్లు ప్రభుత్వ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి


మోగల్లులో కాలనీ సందర్శించి మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

పాలకోడేరు: మోగల్లు ప్రభుత్వ కాలనీలో సమస్యలు తక్షణం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ కాలనీని సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ మండలంలో అతిపెద్ద లే అవుట్ లో మోగల్లు ఒకటన్నారు. ఈ కాలనీలో 700కు పైగా ఫ్లాట్ లు ఉండగా సుమారు 450పైగా నివసిస్తున్నారు అని అన్నారు. కనీస మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.క్రాంతి బాబు, మండల కార్యదర్శి శేషపు అత్రియ్య, గ్రామ కార్యదర్శి పాలా వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ పునఃప్రారంభం

ఆకివీడు: మండలంలోని కొల్లేరు తీర గ్రామం చినమిల్లిపాడులో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎట్టకేలకు గురువారం ఎస్సై హనుమంతు నాగరాజు, ఉపసర్పంచ్ గురుదాసు బాలాజీ పునఃప్రారంభించారు. గత వారం రోజులుగా మంచినీటి వాటర్ ప్లాంట్ ప్రారంభానికి రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీకి చెందిన నాయకులు ఆర్‌ఓ ప్లాంట్‌ను తామే నడుపుతామని తాళాలు తీసుకున్నారని, కొన్ని రోజులు నడిపిన తరువాత మూసివేశారు. ఎనిమిది నెలల తర్వాత గ్రామంలోని పెద్దలంతా కలిసి వాటర్ ప్లాంట్‌ను తామే నడుపుతామని చెప్పి ముందుకు రావడంతో గతంలో తాళాలు తీసుకున్న వ్యక్తులు అడ్డుపడ్డారు. తామే నడుపుతామని మళ్లీ ముందుకు వచ్చారు. ఈ వివాదాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి ద్వారా ప్లాంట్‌ను నడిపించాలని నిర్ణయం తీసుకుని గ్రామస్తులు సమిష్టిగా ఎస్సై నాగరాజు, ఉపసర్పంచ్(వైఎస్సార్‌సీపీ) బాలాజీలతో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభించారు.

ప్రమాదకరంగా రక్షిత నీటి పథకం ట్యాంకు


కూలడానికి సిద్ధంగా ఉన్న రక్షిత నీటి పథకం(ఓహెచ్ఎస్ఆర్)


ఫిల్టర్ బెడ్‌లో పచ్చగడ్డి మొలుస్తున్న దృశ్యం


ఓహెచ్ఎస్ఆర్‌కు చెందిన పిల్లర్ పూర్తిగా ధ్వంసమైన దృశ్యం

- పెచ్చులూడిన పిల్లర్లు
- ప్రజలకు రా వాటర్ సరఫరా

ఆకివీడు: నిధులు లేమితో పంచాయతీలోని రక్షిత నీటి పథకాలు నీరుగారిపోతున్నాయి. మండలంలోని కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు గ్రామంలో మంచినీటి పథకం ప్రమాదకరంగా మారింది. రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ట్యాంక్ కూలడానికి సిద్ధంగా ఉంది. ట్యాంకుకు చెందిన ఒక పిల్లరు శిథిలమైపోగా, మరో పిల్లర్ బీటలు వారింది. ట్యాంక్ పైభాగంలోని బీమ్‌లు కూడా పెచ్చులూడుతున్నాయి. ఓహెచ్ఎస్ఆర్ శిథిలావస్థకు చేరినప్పటికీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు మాత్రం పదిలమేనని చెబుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. రక్షిత నీటి పథకానికి చేర్చి ఉన్న రెండు ఫిల్టర్ బెడ్‌లు కూడా శిథిలావస్థకు చేరాయి. ఒక ఫిల్టర్ బెడ్‌లో పచ్చగడ్డి మొలుస్తోంది. మరో ఫిల్టర్ బెడ్‌లో రా వాటర్ నింపి ప్రజలకు కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు.

నిరుపయోగంగా మారిన సంపు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచినీటి చెరువు వద్ద సంపు నిర్మించినప్పటికీ నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక, కంకర వేసేందుకు నిధులు లేక పనులు చేపట్టలేదని సర్పంచ్ గురుదాసు సీతా బాలాజీ చెబుతున్నారు. తమ గ్రామానికి ఏ విధమైన నిధులు మంజూరు కావడం లేదన్నారు. కనీసం ఉపాధి హామీ పనులు కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీ నాయకులు వాటర్ ప్లాంట్‌ను మేమే నడుపుతామని చెప్పి మూసివేశారు. అప్పటి నుంచి ప్రజలు మంచి నీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పంచాయతీ వాటర్ వర్క్స్ ప్రాంతంలోని స్థలం కూడా తమ గ్రామాభివృద్ధికి అందించి, ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, ప్రజలకు మంచినీరు సరఫరా చేసే విధంగా ఇసుక, కంకర సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రీ-సర్వే పనుల పరిశీలన


ఎన్నార్పీ అగ్రహారంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఉండి: రీసర్వే పనులు పారదర్శకంగా వేగంగా జరిగేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో రీ–సర్వే పనులు జరుగుతున్న తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకేంద్రం స్థలాలను దానిలో ప్రభుత్వ భవనాలకు కేటాయించిన స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం రీ–సర్వేకు సంబంధించిన మ్యాప్‌లను ఆయన పరిశీలించి అధికారులకు, సిబ్బంది పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ–సర్వే పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా నిబంధనల మేరకు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల గుర్తింపులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఉండాలన్నారు. కొలతల ప్రకారం ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జేవీటీ నాయుడు, వీఆర్వో గోవింద తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి


భీమవరంలో ఆర్ఐవో నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భీమవరం: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఐవో ఎ నాగేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రానున్న విద్యాసంవత్సరానికి అడ్మిషన్స్ నిర్వహిస్తున్న శ్రీ చైతన్య, నారాయణ, ఆదిత్య, తిరుమల వంటి జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తి అయినందున ఏప్రిల్ 1వ తేది వరకు సెలవులివ్వాలని ప్రభుత్వం ఆదేశించినా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహించడమేగా ముందుస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారని అటువంటి విద్య సంస్థలపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ లక్ష్మణ్, బి గణేష్, బి సింధు, కె గోవింద్, ఎం భాగ్యలక్ష్మి, కె రోహిత్ తదితరులున్నారు .

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ఆక్వారైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉండిలో రైతు సంఘ సమావేశాన్ని శాఖ మండల ఉపాధ్యక్షుడు జీను ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించేందుకే ప్రభుత్వాలు రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఆక్వాసాగులో పట్టుబడి చేసిన రొయ్యలను భద్రం చేసుకునేందుకు కోల్డు స్టోరేజీలు లేని కారణంగానే ధర లేకపోయినా అయిన కాడికి అమ్ముకోవాల్సి వస్తుందని అన్నారు. ఇదే అదునుగా పట్టుబడి సమయంలో దళారులు సిండికేట్ అయ్యి రైతులను అడ్డంగా దోచేస్తున్నారని మండిపడ్డారు. ఆక్వా వల్ల ప్రభుత్వానికి ఎంతో ఆదాయం లభిస్తున్నా ఆక్వాసాగుకు ప్రభుత్వాల సహకారం లేదన్నారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కిలారి తవిటినాయుడు, మాదాసు గోపి, నక్కా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో 22న ఈటెక్ ఫెస్ట్


భీమవరంలో డీఎన్నార్ కళాశాలలో ఈటెక్‌ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ – హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 22 తేదీన ఈ టెక్‌ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్ చెప్పారు. గురువారం కళాశాలలో ఫెస్ట్ పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న మొదటి సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించటానికి, సాంకేతిక నూతన నైపుణ్యాలను నేర్చుకోటానికి అద్భుతమైన వేదికన్నారు. కార్యక్రమంలో జిజి రత్నం పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూల్ నడపొద్దు


స్కూల్‌ను మూసివేయాలని ఆదేశిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆకివీడు: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఒక ఇంట్లో అనుమతి లేకుండా స్కూల్ నడుపుతున్న విషయాన్ని ఏబీవీపీ గుర్తించి మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎంఈఓ–2 సీతారామయ్య, ఇతర సిబ్బంది ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించగా ఇండియన్ డిజిటల్ స్కూల్, షిర్డీ సాయి కాన్వెంట్ పేర్లతో నడుపుతున్నట్లుగా గుర్తించామన్నారు. వీటికి గుర్తింపులేదని, అనుమతి లేకుండా నడపవద్దని హెచ్చరించి, ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేస్తామని ఎంఈఓ సీతారామయ్య చెప్పారు. ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ పాండవ సాయి, మండల ఉపాధ్యక్షులు అభిషేక్, షాలిమ్ రాజు పాల్గొన్నారు.

22న ఉద్యోగ మేళా

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. లోకమాన్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత , సీపీడీసీ సెక్రటరీ డాక్టర్ పి. బి.ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ మేళాలో దాదాపు 20కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

పాలిథీన్‌తో ప్రజారోగ్యానికి ముప్పు


భీమవరంలో వాకర్స్ అసోసియేషన్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రజారోగ్యానికి పెనుముప్పులా తయారైన పాలిథీన్‌ను నిషేధించాలని భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి అన్నారు. గురువారం భీమవరం టూటౌన్‌లోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ, క్లాత్ బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షుడు గ్రంధి కుమార వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ భీమవరం పట్టణంలో కలెక్టర్ ఆదేశాలతో మునిసిపల్, ఇతర శాఖల ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు, సంఘాల సహకారంతో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీకే పుల్లంరాజు, కార్యదర్శి డి శ్రీధర్ రాజు,కోశాధికారి పి పీటర్, గాదిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల్లో మోసం జరిగిందంటూ ఫిర్యాదు

భీమవరం: భీమవరం రిలయన్స్ జియోమార్ట్ గ్రాబ్ టీం లీడరుగా పనిచేస్తున్న చిట్టూరి బాలకృష్ణ బిల్లు లేకుండా ప్యాకింగ్ చేసిన వస్తువులు డెలివరీ చేస్తూ మోసగించినట్లు సంబంధిత గ్రాబ్ ఏరియా మేనేజరు కుడిపూడి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబర్ 23 నుంచి దఫదఫాలుగా వస్తువులు ప్యాకింగ్ చేసుకుని బిల్లు లేకుండా బయటకు తరలించినట్లు సీసీ కెమెరా ఫుటేజిలో నమోదైందన్నారు. దీనిపై సదరు బాలకృష్ణను నిలదీయగా బిల్లులు లేకుండా రూ.88,299 విలువైన వస్తువులు తీసుకెళ్లినట్లు అంగీకరించాడని తెలిపారు. ఇదిలా ఉండగా స్టోర్‌లోని విలువైన సరుకు కనిపించకపోవడంపై స్టోర్ ఆడిట్ విభాగం పరిశీలించగా రూ.28 లక్షల వ్యత్యాసం ఉందని, బాలకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై బి.వై. కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాలు మారితే బైపాస్ అలైన్‌మెంట్ మారుతుందా?


విలేకరులతో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకోకుండా ప్రభుత్వాలు మారినపుడల్లా బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుచేయడం విడ్డూరంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ అన్నారు. గురువారం భీమవరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో నిర్మించే బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై స్పందిస్తూ ఆకివీడు నుంచి దిగమర్రును కలిపే బైపాస్ ఎనిమిదేళ్లక్రితం ఉండి, భీమవరంటౌన్, నర్సయ్య అగ్రహారం, విస్సాకోడేరు, పెన్నాడ, నందమూరుగరువు మీదుగా వెళ్తుందని ప్రకటించి దానికి సంబంధించి కొంత పనికూడా జరిగిందన్నారు. బైపాస్ రోడ్డు వస్తుందని ప్రభుత్వం ప్రకటించడంతో అనేకమంది మధ్యతరగతి, ఇతర ప్రజానీకం స్థలాలు కొనుగోలు చేశారన్నారు. అయితే ఆకస్మికంగా అలైన్‌మెంట్ మార్పుచేస్తూ కొత్త గెజిట్‌ని విడుదల చేశారని, ఇలా ఎందుకు చేశారో తెలియడం లేదన్నారు. ప్రస్తుతం ఆకివీడు, పెదపుల్లేరు, చినపుల్లేరు, చినఅమిరం, రాయలం, గునుపూడి మీదుగా మళ్లించారన్నారు. గతంలో ప్రకటించిన అలైన్‌మెంట్ మార్చడం వెనుక కారణాలు ఏమిటని గోపాలన్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినపుడల్లా ఇస్టానుసారంగా అలైన్‌మెంట్‌లు మార్పుచేస్తారా అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం చర్య వల్ల ప్రజానీకం తీవ్రంగా నష్టపోతున్నారని ఈ విధానం మంచిది కాదన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

భీమవరం అర్బన్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఇళ్లులేని నిరుపేదలతో ఇళ్ల స్థలాలకై దరఖాస్తులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నాయకులు ఇళ్ల స్థలాలపై ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు నిధులు ఇచ్చి పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నారు. లేకుంటే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. అన్ని నిత్యావసర ధరలు పెరిగిపోయి జీవనోపాధి కష్టంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో గజం భూమి కూడా కొనలేని స్థితిలో పేదలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న నివేశనా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు కూడా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్ సీతారామ్ ప్రసాద్, ఖాన్ భాషా, నడపా స్వరాజ్యలక్ష్మి, దేవి, కృష్ణ వేణి, పెచ్చెట్టి అనంత లక్ష్మీ, మిండాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంతో అదనపు భారం


కాళ్ల: తహసీల్దార్ సుందర్‌సింగ్‌కి వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఓలు

కాళ్ల: క్లస్టర్ కుదింపు విధానంతో వీఆర్‌ఓలపై అదనపు భారం పడుతుందని పాత విధానాన్నే కొనసాగించాలంటూ వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు కాళ్ల తహసీల్దార్ జి.సుందర్ సింగ్‌కు వీఆర్‌ఓలు గురువారం వినతి పత్రం అందజేశారు. రెండు గ్రామాలకు ఒకే వీఆర్‌ఓ పనిచేయాల్సి వస్తుందని, ఈ విధానాన్ని నిలుపుదల చేసి పాత విధానం అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఇప్పటికే పని ఒత్తిడిలో ఉన్న వీఆర్‌ఓలు మరింత ఇబ్బందులు గురవుతారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు కెనడీ, సుబ్రహ్మణ్యం, సుధాకర్, హుస్సేన్, రాజశేఖర్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానం వల్ల వీఆర్‌ఓలకు పనిభారం పెరుగుతుందని వీఆర్‌ఓలు వాపోయారు. క్లస్టర్ విధానం కంటే ప్రస్తుతం ఉన్న విధానాన్ని కొనసాగించాలని తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాలకోడేరు మండల వీఆర్‌ఓ సంఘ అధ్యక్షుడు పి.సురేష్, కార్యదర్శి భోగేశ్వరరావు, వీఆర్‌ఓలు కోటేశ్వరరావు, జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పాలకోడేరు: తహసీల్దార్ భారతీ విజయలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఓలు

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి


అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ఫిర్యాదుదారుల నుంచి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి భీమవరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు, వీఆర్వోలతో సమావేశమై మండలాల వారీగా పి జి ఆర్ ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ అడంగల్ సవరణలు, 22 ఏపై వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల అర్జీల పరిష్కార సమయంలో సిబ్బంది ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలన్నారు. ముందుగా అర్జీదారులకు నోటీసు ఇచ్చి వారికి సమస్యపై అవగాహన కల్పించాలని, వారి నుంచి ఏమైనా ధ్రువపత్రాలు అవసరమైతే ఒక వారం రోజులు సమయం ఇచ్చి వారి నుంచి సంబంధిత ధ్రువపత్రాలు పొందిన తర్వాత సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. నోటీసు ఇవ్వకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించకుండా అర్జీని తిరస్కరించరాదన్నారు. ఈ సమావేశంలో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఏవో పీఎన్ వీ ఎస్ ఎస్ లక్ష్మి, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణంలోని 33/11కె వి టిడ్కో ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 ఎంప్లాయీస్ కాలనీ ఫీడర్‌పై చెట్లుకొమ్మలు తొలగించడం, లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో లెప్రసీ కాలనీ, గాంధీనగర్, టిడ్కో ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

23న పేదవృద్ధ కళాకారులకు సత్కారం

భీమవరం: సంగీతంపై అభిమానంతో గత 19 ఏళ్లుగా పేద కళాకారులతో సత్కరిస్తున్నానని దీనిలో భాగంగా ఈనెల 23వ తేదిన భీమవరం పట్టణంలోని మారుతీటాకీస్ సెంటర్‌లో తొమ్మిది మంది పేద వృద్ధ కళాకారులను సత్కరించనున్నట్లు ప్రవాసభారతీయుడు ఘంటా కృష్ణప్రసాద్ చెప్పారు. మూడున్నర దశాబ్దాలుగా అమెరికాలో ఉంటున్న తాను సంగీత విద్యాభ్యాసం చేసిన సాయిబాబా దేవాలయంలో సంగీత విద్వాంసులు వింజరపు రామకృష్ణ, చెరుకూరి సాయి ప్రభాకరరావు పేరిట ఇరువురు వృద్ధ పేద కళాకారులకు రూ. 5 వేలు, ఏడుగుడిరికి రూ. 2 వేలు చొప్పున నగదుతో సత్కరించనున్నట్లు చెప్పారు.

ఉపన్యాసాలతో మేధస్సు వృద్ధి

ఆకివీడు: ఉపన్యాసాలు ఆయా సబ్జెక్టులలో విద్యార్థుల మేధస్సుకు పదును పెడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపన్యాస కార్యక్రమాలను గురువారం ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆయా సబ్జెక్టులలో అనుభవం కలిగిన అధ్యాపకులు వారి ఉపన్యాసం ద్వారా విద్యార్థులకు మరింత అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. జంగారెడ్డి గూడెంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ కళాశాలకు చెందిన అధ్యాపకులు టీవీ రాంబాబు భౌతిక శాస్త్రంలో 2025 ఇంటర్నేషనల్ క్వాంటమ్ ఇయర్ అనే అంశంపైన, వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.ఉత్తమ్ సాగర్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం ఇచ్చారు. పాలకొల్లు, డీఎన్నార్ మహిళా కళాశాలలకు చెందిన రసాయన అధ్యాపకులు డాక్టర్ జీ.స్వరూప్ సింగ్, పరివర్తన మూలకాలు–ధర్మాలు అనే అంశాలపై ఉపన్యాసాలిచ్చారు.

9.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆకివీడు: మండలంలోని అప్పారావు పేట గ్రామంలోని రేషన్ షాపు నెం. 0534007లో ఆకస్మిక తనిఖీలు చేయగా 9.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ గురువారం చెప్పారు. గ్రామంలోని షాపు తనిఖీకి వెళ్లగా తాళాలు వేసి ఉన్నాయని, గతంలో కూడా ఇదే విధంగా తాళాలు వేసి ఉండడంతో వెనుదిరిగామన్నారు. ఈ సారి తాళాలను గ్రామ వీఆర్వో బందా హరిశ్చంద్ర ప్రసాద్, ఇతర డీలర్లు, గ్రామ పెద్దల సమక్షంలో తాళ్లం బద్దలకొట్టి పరిశీలించగా బియ్యం లభించినట్లు చెప్పారు. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

23న శ్రీరామ జపయజ్ఞం

పెనుగొండ: దేశ ధర్మాల రక్షణ కోసం, ఆలయాల పరిరక్షణ కోసం హైందవి ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆదివారం పెనుగొండ జనార్ధన స్వామి కల్యాణ మండపంలో శ్రీరామ జప యజ్ఞము పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ సమితి కన్వీనర్ చింతాకుల గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు కమలానంద భారతి స్వామీజీ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంతలక్ష్మి ప్రవచనాలు చెబుతారన్నారు. ఉదయం 9 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ ఏర్పాటు చేశామన్నారు.